


సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గత కొన్ని రోజులుగా వైసిపి అధిష్టానం రాష్ట్ర వ్యాప్తంగా ప్రక్షాళన మొదలు పెట్టిన విషయం తెలిసిందే. మార్పులు, చేర్పులు అంతటా చేపడుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ భారీగా మార్పులుంటాయని గత కొంతకాలంగా ప్రచారం నడుస్తోంది. ఈ నేపథ్యంలో మొట్టమొదటిసారి ముగ్గురు నేతలకు పిలుపురావడం చర్చనీయాంశమైంది. వీరికి అధిష్టానం ఏమి చెబుతుందోనన్న ఆత్రుత, ఆందోళన జిల్లా నేతల్లో నెలకొంది.

ఆ ముగ్గురికి ఏమి చెబుతారు.?

◆ అధికార పార్టీ నేతల్లో ఆసక్తి

◆ మొదటి విడతలో ముగ్గురు నేతలకు పిలుపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



వైసిపి అధిష్టానం నుంచి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే, మంత్రి ఉషశ్రీచరణ్, పెనుకొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి శంకర నారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే, విప్ కాపు రామచంద్రారెడ్డిలకు పిలుపు వచ్చింది. మంగళవారానికే పిలుపు వచ్చినప్పటికీ పశ్చిమ గోదావరి జిల్లా నేతల చర్చలు ముగియలేదు. దీంతో వీరితో వైసిపి అధిష్టానం సమావేశం అవలేదు. అయితే పై ముగ్గురూ అందుబాటులో ఉండాలని సూచించినట్టు సమాచారం. మూడు స్థానాల్లో మార్పుల్లో భాగంగానే పిలుపులొచ్చినట్టు ఆ పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మంత్రి ఉషశ్రీచరణ్‌కు సర్వేల్లో పూర్తిగా వ్యతిరేకత రావడమే కాకుండా స్థానిక నేతలు కూడా తీవ్రంగానే వ్యతిరేకిస్తున్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొన్ని నెలల క్రితం నియోజకవర్గాల సమీక్షలు నిర్వహించారు. ఆ సమయంలో నియోజకవర్గ ముఖ్య నేతలతో ముఖాముఖి అయ్యారు. ఆ సమయంలోనూ కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి వైసిని నేతలెవరూ హాజరవలేదు. అప్పట్లోనే వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది. ఈ నేపథ్యంలోనే ఈమెను అధిష్టానం పిలుపునివ్వడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే ఈ నియోజకవర్గం నేతలతో విప్ కాపురామచంద్రారెడ్డి టచ్‌లో ఉంటున్నారు. పిలిపించిన నేతల్లో ఈయన కూడా ఉన్నారు. కాపు రామచంద్రారెడ్డిని కళ్యాణదుర్గంకు మార్చే అవకాశాలున్నాయన్న ప్రచారం జోరుగా నడుస్తోంది. ఇందులో భాగంగానే ఆయన అధిష్టానం సంకేతాల మేరకే కళ్యాణదుర్గం నేతలతో టచ్‌లో ఉంటున్నట్టు తెలుస్తోంది. కళ్యాణదుర్గంకు కాపు రామచంద్రారెడ్డిని మారిస్తే మంత్రి పరిస్థితి ఏమిటన్న చర్చ నడుస్తోంది. దీనిపై ఇప్పుడు పార్టీ ముఖ్య నేతల సమావేశం తరువాత స్పష్టత వచ్చే అవకాశముంది. ఇక పిలుపు వచ్చిన వారిలో మాజీ మంత్రి శంకర నారాయణ ఉన్నారు. ఆయనకు మొదట మార్పు తప్పదని అనుకున్నప్పటికీ తరువాత తనకేనన్న ధీమాతోనున్నారు. ఇప్పుడు ఆయనకు పిలుపురావడంతో మార్పు తప్పదా అన్న చర్చ నడుస్తోంది. పెనుకొండ నియోజకవర్గంలోనూ ఈయనకు సొంత నేతల నుంచే అసమ్మతి పోరు తీవ్రంగానే ఉంది. మార్పు ఉండబోదన్న ప్రచారం జరిగిన వెంటనే నియోజకవర్గంలోని వైసిపి నాయకులు కొందరు తిరుగుబాటు బావుట ఎగువ వేశారు. ఆయన్నే కొనసాగిస్తే పార్టీకి, పదవులకు రాజీనామాలు చేస్తామంటూ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కొందరు బాహాటంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో పెనుకొండ నుంచి ఆయన్ను తప్పించే అవకాశాలే మెండుగానున్నట్టు ప్రచారం నడుస్తోంది. ఈయన్ను హిందూపురం పార్లమెంట్‌కు పోటీ చేయించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇదికూడా ముఖ్య నేతల సమావేశం అనంతరం తేలే సూచనలు కనిపిస్తున్నాయి. ఏది ఏమైనా ముగ్గురు నేతలకు అధిష్టానం పిలుపురావడంతో జిల్లా వైసిపిలో రాజకీయ వేడి రగిలినట్టయింది. తరువాతి వంతులో ఇంకెవరెవరికి వస్తాయన్న చర్చ కూడా నడుస్తోంది.

దిగిరాకుంటే.. దింపేస్తాం..!



ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఆత్మకూరులో ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలుపుతున్నఅంగన్‌వాడీలు



అనంతపురం కలెక్టరేట్ వద్ద సహపంపక్తి భోజనాలు చేస్తున్న అంగన్‌వాడీలు

◆ ప్రభుత్వానికి అంగన్‌వాడీల హెచ్చరిక

◆ 8వ రోజూ జిల్లా వ్యాప్తంగా సమ్మె హోరు

◆ కలెక్టరేట్ ఎదుట సహపంక్తి భోజనాలు

◆ అంగన్‌వాడీ కేంద్రాలు తెరవడాన్ని అడ్డుకున్న స్థానికులు

'న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం తాము సమ్మెల్లోకి వెళ్లాం.. ప్రభుత్వం స్పందించి వీటి పరిష్కారంపై దృష్టి సారించాలి. ప్రభుత్వం మొండి పట్టు వీడి దిగిరాకుంటే వచ్చే ఎన్నికల్లో ఆ ప్రభుత్వాన్నే దింపేస్తాం'. అంటూ అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె జిల్లాలో ఉధృతంగా కొనసాగుతోంది. అన్ని మండలాల్లో నిరసన హోరుతో సమ్మె మంగళవారం నాటికి 8వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం అంగన్‌వాడీలపై వివిధ రూపాల్లో ఒత్తిడి చేస్తున్నప్పటికీ పట్టువిడవక పోరాట స్ఫూర్తితో ఆందోళనలను కొనసాగిస్తున్నారు. సమ్మె సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలను మూత వేసి ఆయా ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద టెంట్లు వేసి దీక్షలు చేస్తున్నారు. ఐసిడిఎస్ అధికారులు, సచివాలయ సిబ్బంది బలవంతంగా అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిని ప్రజల సాయంతో అంగన్‌వాడీలు అడ్డుకుంటున్నారు. వంటా వార్పు, సహపంక్తి భోజనాలు, ఉరితాళ్లు మెడకు వేసుకుని ఇలా పలు వినూత్న రీతిల్లో ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.

తగ్గని సమ్మె హోరు

జాగ్రత్తగా ఓటరుజాబితా రూపకల్పన

జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ డి.మురళీధర్ రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



ఓటరు జాబితాపై ఈఆర్‌ఓలతో మాట్లాడుతున్న మురళీధర్‌రెడ్డి

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం - 2024లో భాగంగా ఓటరు జాబితాను అత్యంత జాగ్రత్తగా రూపొందించాలని ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ డి.మురళీధర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం నాడు అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం - 2024లో భాగంగా వివిధ అంశాలపై ఈఆర్‌ఓలు, జిల్లా కలెక్టర్ ఎం.గౌతమితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫామ్-6,7,8 క్లెయిమ్స్, అభ్యంతరాలకు సంబంధించి ఒకటికి రెండుసార్లు క్షుణ్ణంగా పరిశీలన చేయాలన్నారు. దరఖాస్తుల విచారణలో తూచా తప్పకుండా ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలన్నారు. నియోజకవర్గం వారీగా 2 శాతం కన్నా అధికంగా తొలగింపులు, 4 శాతం కన్నా అధికంగా చేర్పులు ఉంటే అవి సరైనవిగా ఉన్నాయా లేదా అనేది పూర్తిస్థాయిలో పరిశీలించాలన్నారు. ఈ నెల 26వ తేదీ నాటికి క్లెయిమ్స్, అభ్యంతరాలను విడదీయాలన్నారు. పోలింగ్ స్టేషన్‌ల ఏర్పాటును కూడా జాగ్రత్తగా చేపట్టాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి ఏవైనా ఫిర్యాదులు వస్తే వాటిని కూడా వెంటనే పరిష్కరించాలన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా ఓటరు జాబితాను రూపొందించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ఫామ్-6,7,8 దరఖాస్తులను ర్యాండమ్‌గా పరిశీలన చేశామన్నారు. మళ్లీ మరోసారి దరఖాస్తులను పున:పరిశీలిస్తామన్నారు. జిల్లాలో రెండు కిలోమీటర్ల లోపుగానే పోలీస్ స్టేషన్లు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం నవోదయ కాలనీ పశుసంవర్ధక శాఖ కార్యాలయం పోలింగ్ బూత్ కేంద్రం, రుద్రంపేటలోని పోలింగ్ బూత్ కేంద్రాలకు వెళ్లి ఫారం-6, 7, 8 క్లెయిమ్స్‌పై పరిశీలన చేశారు. ఈ కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, ఈఆర్‌ఓలు గ్రంధి వెంకటేష్, రాణి సుస్మిత, సి.శ్రీనివాసులురెడ్డి, సుధారాణి, కరుణకుమారి, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరమ్మ, కలెక్టరేట్ సూపరింటెండెంట్ విశ్వనాథ్, తహశీల్దార్లు బాలకిషన్, శ్రీధర్‌మూర్తి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ భాస్కర్, డిప్యూటీ తహశీల్దార్ కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రి మరో మైలురాయి

◆ 100 యాంజియోప్లాస్టీ, 300 యాంజియోగ్రాం శస్త్రచికిత్సలు పూర్తి ◆ వైద్యులను అభినందించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యసేవలకు సంబంధించిన వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 100 యాంజియోప్లాస్టీ, 300 యాంజియోగ్రాం శస్త్రచికిత్సలు పూర్తయ్యాయి. ఈ మైలురాయిని చేరుకోవడంతో మంగళవారం నాడు అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, కియా సీఈవో డాంగ్‌లిని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యులను సన్మానించారు. ముందుగా కేక్ కట్ చేశారు. ఆ తర్వాత సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలకు సంబంధించి వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రస్తుతం ఏడు విభాగాల్లో స్పెషలిస్ట్ వైద్యులతో సేవలు అందిస్తున్నామన్నారు. కార్డియాలజీ, న్యూరోసర్జరీ విభాగాలు అందుబాటులోకి రావడం వల్ల నిరుపేదలకు ఉపయుక్తంగా మారిందని తెలిపారు. ఆయా విభాగాల హెచ్‌వోడీలు డాక్టర్ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ భాస్కర్‌లను ప్రత్యేకంగా అభినందించారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో మెడికల్ కళాశాలకు అనుబంధంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మంజూరైందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించి ఎంతో మందికి వైద్య సేవలు అందించామని చెప్పారు. కార్డియాలజీ, న్యూరో విభాగాల్లో ఓ మైలురాయిని సాధించడం సంతోషంగా ఉందని, దీనివల్ల వైద్య సిబ్బందిపై మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు. భవిష్యత్తులో రాయలసీమలోనే అనంతపురం సూపర్ స్పెషాలిటీ మంచి పేరు సాధించేలా ప్రతి ఒక్కరూ కషి చేయాలని సూచించారు. అనంతపురం సర్వజన్నాసుపత్రిని నాడు-నేడు కింద రూ.300 కోట్లతో విస్తరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మాణిక్యరావు, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం, ఆర్ఎంఒ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఒ డాక్టర్ హేమలత, అసిస్టెంట్ ఆర్ఎంఒ డాక్టర్ శివకుమార్, డాక్టర్ భీమసేనాచార్, వివిధ విభాగాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీరిచ్చి పంటలను కాపాడండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



హంద్రీనీవా కాలువ కింద సాగు చేసిన పంటలకు సాగునీరిచ్చి పంటలను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హంద్రీనీవా కాలువల కింద పంటలకు నీరు నిలిపి వేయడంతో 62 వేల ఎకరాల్లో పంటలు నష్టపోతాయని తెలిపారు. వేల కోట్ల రూపాయల పెట్టుబడి ఖర్చులు, లక్షలాది రూపాయల కౌలు డబ్బులు రైతులు నష్టపోతున్నారని తెలిపారు. విడపనకల్లు, ఉరవకొండ ప్రాంతాల్లో రైతులు చేస్తున్న ఆందోళనకు సిపిఎం మద్దతుగా నిలుస్తుందన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో హంద్రీనీవా కింది సాగు చేసిన పంటలు పూర్తయ్యే వరకు నీరు ఇవ్వాలని నవంబర్ 7వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రికి సిపిఎం వినతిపత్రం పంపిందని ఆయన గుర్తు చేశారు. నవంబర్ రెండో వారంలోనే కలెక్టర్ ఆఫీస్, ఇరిగేషన్ ఆఫీసుల వద్ద ఆందోళనలు, ఉరవకొండలో రైతులు రాస్తారోకోలు చేసిన తర్వాత కొంత నీరు విడుదల చేశారని తెలిపారు. రైతు ప్రభుత్వమని, వారి సమస్యలు తీరుస్తున్నామని ప్రచారం చేసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి హంద్రీనీవా కింద ఎండుతున్న పంటలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. జిల్లాకు 12 సంవత్సరాలుగా హంద్రీనీవా నీరు వస్తున్న ఒక ఎకరానికి సాగు నీరు ఇవ్వకపోవడం జిల్లా రైతుల పట్ల పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. కాలువ నీరు తమ పొలాలకు తీసుకునేందుకు రైతులు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. మొదటి దశ కింద పంట కాలువలు పూర్తి చేసి ఉంటే రైతులకు ఈ సమస్యలు వచ్చి ఉండేవికాదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల జీవితాలతో ఆడుకోకుండా ఎండుతున్న పంటలను కాపాడే చర్యలను యుద్ధ ప్రాతిపదికన తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


సాగునీరివ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యం

మరోసారి రోడ్డెక్కిన రైతులు

జిబిసికి నీరు విడుదల చేయాలని డిమాండ్

టిడిపి, సిపిఐ, జనసేన నేతల సంఘీభావం

ప్రజాశక్తి-ఉరవకొండ



రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు (ఇన్‌సెట్‌లో) పోలీసులకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కేశవ్

గుంతకల్లు బ్రాంచి కెనాల్‌కు సాగునీరు విడుదల చేసి ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జిబిసికి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున రైతులు మంగళవారం ఉరవకొండ సమీపంలోని అనంతపురం-బళ్లారి రహదారిపై ఉన్న హంద్రీనీవా కాలువ వద్ద ఆందోళన చేపట్టారు. వీరి ఆందోళనకు టిడిపి, సిపిఐ, జనసేన పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌తోపాటు రైతులు మాట్లాడుతూ 15 రోజుల క్రితమే కాలువకు నీరు బంద్ చేయడంతో దాదాపు 26వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు ఎండిపోతున్నాయన్నారు. హంద్రీనీవా కాలువ నుంచి నీటిని మళ్లించి పంటలను కాపాడాలని ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. హంద్రీనీవా నుంచి చిత్తూరు జిల్లా పుంగనూరుకు తీసుకెళ్తున్న నీటిని ఈ ప్రాంతానికి ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. కనీసం ఒక తడి నీరు ఇచ్చి పంటలను కాపాడాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పంటలు నష్టపోయి రైతులు దాదాపు రూ.300 కోట్లు నష్టపోతారన్నారు. ప్రభుత్వానికి చేతకాకపోతే తమకు అప్పగిస్తే రైతులకు నీటిని అందిస్తామన్నారు. 2016లో కూడా ఇలాంటి పరిస్థితి వస్తే హంద్రీనీవా నుంచి జిబిసి కాలువకు నీటిని అందించి పంటలను కాపాడామని గుర్తు చేశారు. మరోవైపు పంటలకు నీరందక ఎండిపోతుంటే మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు సాగునీరు ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న గుంతకల్లు డీఎస్పీ నర్సింగప్ప ఆధ్వర్యంలో పోలీసులు ఆందోళన వద్దకు చేరుకుని ఎమ్మెల్యే కేశవ్‌తోపాటు పలువురిని అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో విడపనకల్ టిడిపి మండల కన్వీనర్ చిన్నమారయ్య, నాయకులు తిమ్మరాజు, చంద్రశేఖర్, రాజాస్వామి, తిప్పారెడ్డి, వీరసింహా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, నాయకులు సుల్తాన్, సంజమ్మ, జనసేన జిల్లా కార్యదర్శి గౌతమ్‌కుమార్, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

21 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

అనంతపురంలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం డిసెంబర్ 21 నుంచి తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం నగరంలోని గుత్తి రోడ్డు ఐదు లైట్లు సర్కిల్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించిందన్నారు. ముఖ్యంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమ్మెకు నగర ప్రజలు సహకరించాలని కోరారు.

రాయదుర్గం : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు తిప్పేస్వామి, రాము, మల్లేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ తెలిపారు. ఈమేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో ఛైర్‌పర్సన్ పొరాళ శిల్పకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ డిమాండ్లు పరిష్కరించాలని దీర్ఘకాలంగా అనేక విడతలుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఇంతవరకూ సమస్యలు పరిష్కరించలేదన్నారు. ఇందుకు నిరసనగా 21వ తేదీ నుంచి సమ్మెలో వెళుతున్నట్లు తెలిపారు.

21న జెవివి మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జెవివి నగర అధ్యక్షుడు రామిరెడ్డి, సహాయ కార్యదర్శి రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఈ టాలెంట్ టెస్టును నగరంలోని కొవ్వూరు నగర్ విశ్వభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి స్కూల్ నుంచి ముగ్గురు చొప్పున అనంతపురం నగరం, రూరల్ ప్రాంతం నుంచి 150 మందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్నారని వారు తెలియజేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌కెయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.వి.లక్ష్మయ్య, గౌరవ అతిథిగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సమత కన్వీనర్ డాక్టర్ ప్రసూన తదితరులు పాల్గొంటున్నారని తెలిపారు.

అనంతలో బిగ్‌బాస్ రన్నర్ అమర్‌దీప్

ప్రజాశక్తి-అనంతపురం



అభిమానులకు అభివాదం చేస్తున్న అమర్‌దీప్

బిగ్‌బాస్ సీజన్-7లో రన్నరప్‌గా నిలిచిన అమర్‌దీప్ చౌదరిని మంగళవారం నాడు అనంతపురంలో సందడి చేశారు. నగరంలోని టీటీడీ కళ్యాణ మండపంలో అమర్‌దీప్ అభిమానులు ఆయనకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అభిమానుల మధ్య అమర్‌దీప్ తన ఆనందాన్ని పంచుకున్నారు. తపోవనం నుంచి వాయిద్యాల మధ్య ఇంటికి చేరుకున్నాడు. సాయంత్రం టిటిడిలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుల్లితెరలో మంచి గుర్తింపు తెచ్చుకున్న అమర్‌దీప్ బిగ్‌బాస్ సీజన్-7లో ప్రత్యేకతను చాటుకుని రన్నరప్‌గా నిలిచారు. అమర్‌దీప్ అనంతకు రావడంతో ఆయన్ను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు టిటిడికి తరలివచ్చారు. ఆయనతో కరచాలనం చేసేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు. ఈ సన్మాన కార్యక్రమంలో అమర్దీప్‌తో పాటు పలువురు నటులు, పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేటి నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

పుట్లూరు : న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారం కోసం నేటి నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు సమగ్ర శిక్ష ఉద్యోగులు అశ్వర్థ, లాజరయ, జయ చంద్ర, వీరయ్య, నారాయణస్వామి, శ్రీరాములు తెలిపారు.

తగ్గని సమ్మె హో(పో)రు

కొనసాగిన అంగన్వాడీల ఆందోళనలు.. గుంతకల్లులో గాడిదకు వినతిపత్రం..పలుచోట్ల వంటావార్పు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

8వ రోజు సమ్మెలో భాగంగా అనంతపురం కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు రోడ్డుపై బైటాయించి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం శిబిరం వద్దకు చేరుకుని సమ్మె కొనసాగించారు. అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నగర అధ్యక్షురాలు జయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమ్మెకు జెఏసి ఎఐటియుసి నాయకులు ఏసురత్నం, ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్‌గౌడ్, నగర కార్యదర్శి కృష్ణుడు, గ్రామ పంచాయతీ ఉద్యోగులు కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, మున్సిపల్ ఉద్యోగులు కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ మద్దతుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలు చేస్తున్న సేవలకు ఇస్తున్న వేతనాలకు పొంతన లేదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కనీస వేతనాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలు గడవటం కష్టతరంగా ఉంటుందన్నారు. తెలంగాణ కంటే అదనంగా కనీస వేతనాలు ఇస్తామన్న జగన్‌మోహన్‌రెడ్డి తన మాటను నిలుపుకోవాలన్నారు. వెంటనే కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమ్మెను విరమింపజేయాలని కోరారు. అలాకాకుండా మొండిగా బెదిరింపు చర్యలకు పాల్పడి సమ్మెను అడ్డుకుంటామంటే ప్రజలంతా తిరగబడే పరిస్థితి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జమున, అరుణ, రుక్మిణి, రేవతి, యశోద తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్వాడీ చేస్తున్న సమ్మె మంగళవారం 8వరోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని గాడిదకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఆదేవిధంగా శిబిరంలో మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సమ్మెకు సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్ల యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గంగ, రేష్మా, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కసాపురం రమేష్, సాకే నాగరాజు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్ల సమస్యల పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఇది సరైంది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు మొండి వైఖరి విడనాడి అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు నాగమణి, కుమారి, మేరీ, పార్వతి, అంగన్వాడీలు, సహాయకులు పాల్గొన్నారు.

గుత్తి : ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె గుత్తిలో మంగళవారం 8వ రోజుకి చేరుకుంది. ఇందులో భాగంగా అంగన్వాడీలు మోకాళ్లపై నిల్చొని నోటిలో పచ్చగడ్డి పెట్టుకుని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. అలాగే నోటికి నల్లరిబ్బన్లు ధరించి మౌనదీక్ష చేపట్టారు. సమ్మెకు సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ మద్దతు పలికారు. శిబిరంలో బైఠాయించి సంఘీభావం తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పుట్లూరు : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం కూడా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ధర్నా చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సమస్యలు పరిష్కరించకపోగా ఉద్యమాన్ని నీరుగార్చాలని చూడటం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.సూరి, నాయకులు పెద్దయ్య, రైతుసంఘం నాయకులు వెంకటచౌదరి, భాస్కర్‌రెడ్డి, మండల నాయకులు నాగభూషణం, అంగన్వాడీ నాయకురాళ్లు జయలలిత, శశికళ, అనంతలక్ష్మి రమాదేవి, అంగన్వాడీలు నాగేశ్వరమ్మ, కళావతి, ఏ.కొండాపురం సర్పంచి వనజ, సెక్టార్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగనవాడీల సమస్యలు చేపట్టిన సమ్మె మంగళవారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా సమ్మె శిబిరం వద్ద వంటావార్పు చేసి అక్కడే భోజనం చేశారు. వీరి దీక్షకు దిన్నూరులు మద్దతు తెలుపుతూ దీక్షలో కూర్చొన్నారు. వీరితోపాటు మండల ఎస్ఆర్పి కార్మికులు వన్నూరుస్వామి, తిప్పేస్వామి, రమేష్, చిత్తయ్య పూర్తి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ కోశాధికారి రాజమ్మ, సెక్టార్ లీడర్లు తిప్పేరమ్మ, వరలక్ష్మి, సుజాత, అనిత, వర్కర్లు సుజాత, సంతోషమ్మ, త్రివేణి, ఎర్రమ్మ, సత్యమ్మతో పాటు 115 మంది వరకు అంగన్వాడీలు పాల్గొన్నారు.

శింగనమల : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేస్తున్న చేపట్టిన సమ్మె మంగళవారం 8వరోజుకు చేరుకుంది. వీరి దీక్షకు టిడిపి అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించే అంగన్వాడీల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగొచ్చి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మామిల్ల చంద్రమోహన్, నాయకులు నరేంద్రకుమార్‌యాదవ్, కొయ్యగూర పెద్దన్న, జడేజా, శంకర్, మొండిపోగుల ఎర్రిస్వామి, వీరనారాయణ, తరిమెల చిరంజీవి, బోయ సుధాకర్, రవి, అంజి, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్ : మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం ఆవరణలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా వంటావార్పు చేసుకుని అక్కడే భోజనం చేశారు. వీరికి వీఆర్వో, హమాలీ, వీఆర్ఏ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. వీరితోపాటు చిన్నపిల్లలు కూడా సమ్మె దీక్షలో కూర్చొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సంఘం అధ్యక్షురాలు సుజాత, వీఆర్ఏ సంఘం అధ్యక్షుడు మారుతి, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం 8వరోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా శిబిరం వద్ద మెడకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలు శిబిరం వద్ద వంటావార్పు చేసుకుని అక్కడే భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు శకుంతల, అంగన్వాడీలు తదితరులు తెలిపారు.

గుమ్మఘట్ట : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం 8వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీలు శిబిరం వద్దే వంటావార్పు చేసుకుని అక్కడే భోజనం చేశారు. ఈ సందర్భంగా రాయదుర్గం ప్రాజెక్టు కార్యదర్శి మేరీ మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లను మూసివేసి పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించకుండా 8 రోజుల నుంచి రోడ్లపై ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగొచ్చి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రాధిక, రుద్రమ్మ, మెహ్రూన్, చంద్రకళ, మల్లక్క, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం 8వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమ్మె దీక్షకు సిఐటియు నాయకులు నాగేంద్ర, టిడిపి నాయకురాలు హిమబిందు, ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ మెంబర్ అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్, ఎఐటియుసి నాయకురాలు కె.జ్యోతి మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు సిఎం జగన్ అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాబా ఫక్రుద్దీన్, ఈశ్వరయ్య, ముత్యాలు, అంగన్వాడీలు జయంతి, నారాయణమ్మ, మహాలక్ష్మి, రామాంజనమ్మ, రమాదేవి, సేకున్‌బి, ప్రేమకుమారి, తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

పెద్దవడుగూరు : మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళశారం 8 రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ అంగన్వాడీలు గొంతెమ్మ కోరికలు కోరడం లేదన్నారు. స్వయానా సిఎం జగన్ ఇచ్చిన హామీలనే అమలు చేయాలని కోరుతున్నారన్నారు. అలాంటి వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగొచ్చి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు దస్తగిరి, శివకుమార్, ఈశ్వర్‌రెడ్డి, అంగన్వాడీ మండల కార్యదర్శి నాగరాణి అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ఉమాదేవి, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా 8వరోజు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు మండేలా రామాంజనేయులు, శివగోపాల్, మండల కార్యదర్శి నాగేంద్ర, శింగనమల ప్రాజెక్టు కార్యదర్శి కె.కాత్యాయని, వ్యవసాయ కార్మిక సంఘం పి.పుల్లయ్య, మండల సెక్టార్ లీడర్లు విమల, సుజాత, రత్నమ్మ, సుభాషిణి, వెంకటలక్ష్మి, గీత, లక్ష్మీదేవి, అంగన్వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు విజయ, అరుణకాంతమ్మ డిమాండ్ చేశారు. ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారు. సమ్మెకు సిపిఎం మండల కన్వీనర్లు మధుసూదన్, విరుపాక్షి, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, జ్ఞానమూర్తి, సీనప్ప, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి చెన్నరాయుడు, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బెంజిమెన్, హమాలీ సంఘం నాయకులు చిన్న ఆంజనేయులు, యానిమేటర్ల సంఘం నాయకులు సుధాకర్, రాజు, ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండల లీడర్లు, దుర్గాదేవి, ధనలక్ష్మి, విజయ, శ్వేతనాగు, జ్యోతి, రామంజినమ్మ, స్వర్ణలత, రామాంజనమ్మ, హేమలత, దేవి, లక్ష్మీదేవి, శశికళ, నాగమణి, శివశ్రీ, సువర్ణమ్మ, కృష్ణవేణి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : ఎన్నోఏళ్లుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు, టీచర్లు చేపడుతున్న సమ్మె మంగళవారం 10వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా తమ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న అంగన్వాడీలు తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో వంటావార్పు చేసి నిరసన తెలిపారు.



బ్రహ్మసముద్రంలో వంటావార్పు



రాయదుర్గంలో సహపంక్తి భోజనాలు

కేంద్రాలను ఎలా తెరుస్తారు..?

అధికారులను అడ్డుకున్న స్థానికులు



పెద్దవడుగూరులో అంగన్వాడీకి తాళం పగులగొట్టి తెరుస్తున్న అధికారులు

'సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ కార్మికులు సమ్మె చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వారికి అండగా నిలవాల్సింది పోయి దౌర్జన్యంగా అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టి ఎలా తెరుస్తారు'... అంటూ అనంతపురం నగరం రాజీవ్ కాలనీ మహదేవ నగర్‌లోని ప్రజలు సచివాలయ ఉద్యోగులను నిలదీశారు. మంగళవారం ఉదయం రాజీవ్ కాలనీ మహదేవ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం వద్దకు సూపర్‌వైజర్, సచివాలయ ఉద్యోగులు చేరుకుని తెరిచే ప్రయత్నం చేశారు. కేంద్రానికి సరుకులు వచ్చాయి.. సెంటర్‌లో పెట్టాలంటూ తాళాలు పగులగొట్టేందుకు యత్నించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎంపిటిసి సభ్యురాలు రమీజాబి, ప్రజలు అక్కడికి చేరుకుని అధికారుల చర్యను అడ్డుకున్నారు. అంగన్‌వాడీ కార్మికులు వచ్చేంత వరకు తెరవడానికి వీల్లేదని తెలియజేశారు. అంగన్‌వాడీల న్యాయమైన పోరాటంలో వారికి అండగా ఉండేలా అధికారులు వ్యవహరించాలన్నారు. అలా కాకుండా మొండిగా తాళాలు పగులగొట్టేందుకు వస్తే ప్రతిఘటిస్తామన్నారు. దీంతో అధికారులు అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

కాగా పెద్దవడుగూరులోని కేంద్రాలను ఐసిడిఎస్ తాడిపత్రి సిడిపిఓ షాజిదాబేగం, సూపర్‌వైజరు వెంకటలక్ష్మి, రెవెన్యూ కార్యదర్శి అనిల్, మహిళా కానిస్టేబుల్ ప్రశాంతి, తదితరులు వెళ్లి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు.



బుక్కరాయసముద్రంలో కళ్లకు గంతలు కట్టుకుని మోకాళ్లపై నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

'ఎస్ఆర్ఐటి'లో విద్యార్థిని మృతిపై విచారించాలి

ఐక్య విద్యార్థి సంఘాల నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎస్ఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి కవిత ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టాలని ఐక్య విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎఐఎస్బి జిల్లా కార్యదర్శి పృథ్వీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్‌యాదవ్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు ఓబులేష్, జనసేన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు సిద్ధు మాట్లాడుతూ ఎస్ఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్న కవిత ఉరేసుకోవడం బాధాకరమన్నారు. ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్ధు, గిరి, శివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెవిలోపూలతో పంచాయతీ కార్మికుల నిరసన

బుక్కరాయసముద్రం : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో చేపట్టిన సమ్మెలో భాగంగా పంచాయతీ కార్మికులు చెవిలో పూలు పెట్టుకుని మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు మండేలా రామాంజనేయులు, గోపాల్, శివప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం వెంటనే పంచాయతీ అధికారులకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని, పనిముట్లు అందజేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పీఎఫ్ ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి నాగేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం పుల్లయ్య, ఎర్రన్న, అంకాలు, పంచాయతీ వర్కర్లు ఎర్రినాగయ్య, నాగరాజు, సి నాగేంద్ర, విజయ్, ఎర్ర కొండప్ప, నగేష్, లక్ష్మీదేవి, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, పవిత్ర పాల్గొన్నారు.



చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

సాగుచేసుకుంటున్న వారికే పట్టాలు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-గార్లదిన్నె

మండల పరిధిలోని కోటంక గ్రామంలో సర్వేనెంబర్ 243-1లో భూమి సాగు చేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ నిరుపేద రైతులకే పట్టాలు ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు మాట్లాడుతూ 2018 నుంచి 20 మంది నిరుపేద రైతులు ఒక్కొక్కరు ఎకరా చొప్పున సాగు చేసుకుంటున్నారన్నారు. వారందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో నిరుపేదలు సెంటు స్థలం కోసం ప్రాధేయ పడాల్సిన అవసరం రావడం బాధారకమన్నారు. కల్లూరు గ్రామంలో 57 ఎకరాల దేవాదాయ శాఖ భూమిని అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకున్నా పట్టించుకోని అధికారులు, పేదలు సెంటు స్థలం ఆక్రమించుకుంటే ఆగమేఘాలపై స్పందించి గుడిసెలు కూల్చి వేస్తారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు మల్లికార్జున, నల్లప్ప, నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

కనీస వేతనం అమలు చేయాలి

ప్రజాశక్తి-గుత్తి



ఆర్టీసీ డిపో ఇన్‌ఛార్జి మేనేజర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కాంటాక్ట్, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ ఫెడరేషన్ ఎపి రాష్ట్ర కమిటీ కన్వీనర్ వి.తులసీరామ్, సిఐటియు మండల కార్యదర్శి వి.నిర్మల డిమాండ్ చేశారు. ఈమేరకు గుత్తి ఆర్టీసీ డిపో ఇన్‌ఛార్జి మేనేజర్ శ్రీపాదరావు కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వం, యాజమాన్యం గాలికి వదిలేసిందన్నారు. అద్దె బస్సు డ్రైవర్లు, ఆర్టీసీ బస్సుల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ డ్రైవర్లకు కనీసం పిఎఫ్, ఈఎస్ఐ, వారాంతపు సెలవులు, పబ్లిక్ హాలిడేస్ వర్తింపజేయడం లేదన్నారు. గుర్తింపు కార్డులు కూడా ఇవ్వడం లేదన్నారు. విధుల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. నిత్యావసర ధరలు, ఇంటి అద్దెలు, విద్య, వైద్యం, కరెంటు ఖర్చులు భారీగా పెరుగుతున్నా, జీతాలు మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య స్కోర్ స్కాలర్‌షిప్ పరీక్షల విజేతలకు అవార్డులు

అనంతపురం : శ్రీచైతన్య మేనేజ్‌మెంట్ నిర్వహించిన స్కోర్ స్కాలర్‌షిప్ పరీక్ష-2023 ప్రకటించిన ఫలితాల్లో జిల్లా నుంచి 13 మంది విద్యార్థులు రివార్డులు కైవసం చేసుకున్నట్లు ఏజిఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఈమేరకు విజేతలకు ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్‌తో రూ.1,19,000 చెక్కును విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపళ్లు కె.విశ్వనాథ్, సమీనాఖాన్, ఖలందర్, తబస్సు, శ్రీదేవి, నారాయణస్వామి, బాబు, ఫిలిప్, నవీన్, కోఆర్డినేటర్లు రాధాకృష్ణ, తిరుమలేష్, శ్రీనివాస్, నాగభూషణం, డీన్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కర్ణాటక మద్యం పట్టివేత

నార్పల : అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.2లక్షల విలువజేసే కర్ణాటక మద్యాన్ని నార్పల పోలీసులు పట్టుకున్నట్లు డీఎస్పీ వెంకటశివారెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది మండల పరిధిలోని నార్పల క్రాస్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా బత్తలపల్లి రోడ్డు వైపు ఓ కారులో కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కారులో మద్యాన్ని తరలిస్తున్న పుట్లూరు మండలం గురువుచింతపల్లికి చెందిన కాయపాటి గోవర్ధన్, యల్లనూరు మండలం చింతకాయమందకు చెందిన మండ్ల రాజు, ఇదే మండలం గొడ్డుమరికి చెందిన చౌడూరు ఆవుల స్వామి, కల్లూరు గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా కలిసి కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి ప్రాంతం నుంచి సుమారు 27 కేసుల మద్యాన్ని కారు వెనుక డిక్కీలో వేసుకుని వస్తుండడంతో పోలీసులు పట్టుకున్నారు. ఈమేరకు కర్ణాటక మద్యాన్ని పట్టుకున్న ఎస్ఐతోపాటు హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్, కానిస్టేబుళ్లు రాము, అనిల్, గౌసు, దేవలనాయక్, హరి, అనిల్‌ను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని గరుడాపురం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. గరుడాపురం గ్రామ నివాసి గంగాధర్ గరుడాపురం వద్ద రోడ్డు దాటుతుండగా కుందుర్పి వైపు నుంచి కళ్యాణదుర్గం వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈప్రమాదంలో గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగదు, బంగారం చోరీ

బెలుగుప్ప : మండల పరిధిలోని నరసాపురం గేట్ వద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు శంకర్‌గౌడ్ ఇంట్లో బీరువాను పగలగొట్టి రూ.30వేల నగదు, 1.5తులాల బంగారాన్ని దోచుకెళ్లారు. గమనించిన బాధితుడు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ దేవదాస్ ఘటనా స్థలానికి చేరుకుకుని క్లూస్‌టీంతో విచారణ చేయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

పెద్దవడుగూరు : మండలంలోని కిష్టిపాడుకు చెందిన బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన అదేగ్రామానికి చెందిన పుల్లయ్యపై పోక్సో, దిశా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఇంటి వద్ద ఉన్న బాలికను నమ్మించి మోసం చేశాడని బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టగా వాస్తవమని తెలడంతో మంగళవారం పుల్లయ్యపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుత్‌ను ఆదా చేయాలి : ఎస్‌ఇ సురేంద్ర

ప్రజాశక్తి అనంతపురం



టవర్‌క్లాక్ వద్ద ర్యాలీ చేస్తున్న విద్యుత్ అధికారులు

విద్యుత్‌ను పొదుపు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని విద్యుత్ శాఖ ఎస్ఇ సురేంద్ర పిలుపునిచ్చారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టరేట్ మీదుగా సప్తగిరి సర్కిల్, టవర్ క్లాక్, ఓల్డ్ టౌన్ మీదుగా పవర్ ఆఫీస్ వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎస్ఇ మాట్లాడుతూ విద్యుత్ ఆదా భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమన్నారు. విద్యుత్ పొదుపు పాటించడం వల్ల అనేక లాభాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అంతేగాకుండా పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇంధన పొదుపు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఇఇ జెవి రమేష్, రాజశేఖర్, ఏడీలు వివేకానంద, నాగేంద్ర, లక్ష్మీనారాయణ, యావత్ విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి-పామిడి



చెత్తను సేకరిస్తున్న కార్మికులు

ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యం సాధ్యమని పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో సూచించారు. ఇందులో భాగంగానే పంచాయతీలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రజారోగ్యం కాపాడడంలో స్థానికులు పంచాయతీ సిబ్బందికి అన్నివిధాలుగా సహకరించాలని కోరారు. ప్రజలు వారి ఇళ్లల్లోని చెత్తను డ్రెయినేజీ, కాలువల్లో వేయకుండా పంచాయతీ కార్మికులు తీసుకొచ్చే వాహనాలకు అందజేయాలన్నారు. చెత్తను కాలువల్లో వేయడం వల్ల మురుగునీరు వెళ్లకుండా ఒకేచోట నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెంది ప్రజలకు రోగాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కావున ప్రజలు తమ ఇళ్లల్లో బుట్టలు, సంచుల్లో వేసుకుని మీ దగ్గరకు వచ్చే పంచాయతీ వాహనాలకు ఇవ్వాలని కోరారు. ఒకవేళ మీ ఏరియాలో చెత్తను తీసుకెళ్లేందుకు వాహనాలు రాకపోతే సెల్..83283 79004కు కాల్ చేయాలని సూచించారు.

సీజనల్ వ్యాధులను అరికడదాం

ఉరవకొండ : దోమలను నివారించి సీజనల్ వ్యాధులను అరికడదామని రాకెట్ల ప్రభుత్వ వైద్యాధికారి వెంకటేష్‌నాయక్, ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మోపిడి గ్రామంలో సర్పంచి సిద్దార్థ ఆధ్వర్యంలో రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. అలాగే గ్రామపంచాయతీ కార్యదర్శి రమణకుమార్ ఆధ్వర్యంలో శానిటేషన్ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, మండల ఆరోగ్య విస్తరణాధికారి నాగ రంగయ్య, హెల్త్ అసిస్టెంట్ టిఎస్ రాఘవేంద్రస్వామి, ఎంఎల్‌హెచ్‌పి హెబ్సిబా, కమ్యూనిటీ ఆర్గనైజర్ భగవాన్‌దాస్, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు

ఉరవకొండ : మండల కేంద్రంలోని అయ్యన్ ఫెర్టిలైజర్ దుకాణాన్ని విజిలెన్స్ సిఐ వెంకటరమణ, మండల వ్యవసాయ అధికారి శుభకర్‌తో కలిసి మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా రూ.1,05,432 విలువైన ఎరువులను అమ్మకుండా నిలుపుదల చేశారు. అదేవిధంగా రూ.89,802 విలువైన 6.3 మెట్రిక్ టన్నుల ఎరువులను జప్తు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఏవో వాసుప్రకాష్, కానిస్టేబుల్ మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరం

నార్పల : మండల పరిధిలోని దుర్గం గ్రామంలో సవేరా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో సర్పంచి సాకే రామాంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత గుండె వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పలువురికి గుండె జబ్బులకు సంబంధించిన పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్‌కుమార్, మేనేజర్ అరీఫ్, ఎంఎల్‌హెచ్‌పి అమృతాంజలి, ఆశా కార్యకర్త వీరనారాయణమ్మ, గ్రామస్తులు వడ్డే నారాయణస్వామి, చాకలి నాగప్ప, లక్ష్మీదేవి, రంగమ్మ, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

అష్ఫాఖుల్లాఖాన్ రాంప్రసాద్ బిస్మిల్ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

అనంతపురం కలెక్టరేట్ : స్వాతంత్ర్య సమరయోధులు దేశభక్తులైన అష్ఫాఖుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అష్ఫాఖుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ 96వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాతభూమిని ఆంగ్లేయుల దాస్య శంఖలాల నుంచి విముక్తి కోసం పోరాడారని తెలిపారు. 1857లో ది ఇండియన్ రెబెలియన్ గ్రూప్ పేరుతో పోరాటాన్ని నాయకులు ప్రారంభించారని తెలిపారు. 27 ఏళ్ల వయసులోనే దేశం కోసం ప్రాణాలు అర్పించిన భరతమాత ముద్దుబిడ్డ అష్ఫాఖుల్లా ఖాన్ చిరస్మరణీయుడని కొనియాడారు. రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫఖుల్లా ఖాన్ దేశభక్తులుగా ఉండి పోరాడారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలీ, ఇర్ఫాన్, ఫక్రుద్దీన్, శర్మాస్, ఇమామ్ బాషా, దాదు, ఆజాం, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం : సిడిపిఒ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం



మాట్లాడుతున్న ఆర్డీటీ సెక్టార్ టీం లీడర్ ఆదినారాయణ

గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టి ఆడబిడ్డలను కాపాడుదామని ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీప్రసన్న పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని వేపులపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'బాలికల భద్రత సామాజిక బాధ్యత'లో భాగంగా ఆర్డీటీ సెక్టార్ టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా లఘుచిత్రాల ద్వారా చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో బాలల పట్ల వివక్ష తీవ్రరూపం దాల్చిందన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయన్నారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల అమ్మాయిలు మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతారన్నారు. అంతేగాకుండా ప్రసవ సమయంలో తల్లీ బిడ్డ ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కావున ఆడ పిల్లలకు 18, మగ పిల్లలకు 21ఏళ్లు నిండిన తర్వాత వివాహాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి దాసానాయక్, మండల విద్యాధికారి కృష్ణానాయక్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రామంజినమ్మ, ఖాసీంబీ, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి, ఉపాధ్యాయులు స్వరూప, యూనీస్‌లక్ష్మీ, చిన్నారులు పాల్గొన్నారు.

శారీరక ఆరోగ్యానికి క్రీడలు ముఖ్యం

14వ బెటాలియన్ కమాండెంట్ ఆర్.గంగాధర్‌రావు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం




గౌరవ వందనం స్వీకరిస్తున్న 14వ బెటాలియన్ కమాండెంట్ ఆర్.గంగాధర్‌రావు

శారీరక ఆరోగ్యానికి క్రీడలు చాలా అవసరమని 14వ బెటాలియన్ కమాండెంట్ ఆర్.గంగాధర్‌రావు సూచించారు. మండల పరిధిలోని జంతులూరు వద్ద ఉన్న 14వ బెటాలియన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది మానసిక, శారీరక ఒత్తిడి తగ్గించుకునేందుకు, ఆరోగ్యం కాపాడుకునేందుకు క్రీడలు చాలా ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, ఎస్‌కెయు ప్రొఫెసర్ కొమ్మ వేణుగోపాల్‌రావు, డీఎస్పీలు రమణమూర్తి, దామోదర్, కెఎంబి ప్రాజెక్ట్ మేనేజర్ ధనుంజయరావు, సెంట్రల్ యూనివర్సిటీ సిపిడబ్ల్యుడి శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రాము, నాగేంద్ర, లోకేశ్వరనాయుడు, రామారావు, కృష్ణానాయక్, ఆర్ఎస్ఐలు, ఆఫీసర్లు, అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతుల మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరిస్తున్న 'కేశవ్'

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం



మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

గుంతకల్లు బ్రాంచి కెనాల్ ఆయకట్టు పరిధిలోని రైతుల మధ్య చిచ్చుపెట్టేలా ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. మంగళవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిబిసి ఆయకట్టు పరిధిలో పది కిలోమీటర్లు ఇటువైపు, అటువైపు రైతులను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పంటల ఎండకుండా చర్యలు చేపడతామన్నారు. చిత్త శుద్ధి ఉంటే హంద్రీనీవా నుంచి నీటి విడుదలకు తనతోపాటు కలిసి వచ్చి సహకరించాలని కోరారు. రాజకీయాలు చెయ్యకుండా రైతుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు.

ఉద్యోగుల బకాయిలను చెల్లించాలి : యుటిఎఫ్

అనంతపురం కలెక్టరేట్ : ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోవిందరాజులు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం నాడు యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిఆర్ఒ గాయత్రిదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్‌లకు ప్రతినెలా 1వ తేదీన జీతాలు చెల్లించాలన్నారు. వేతనాలు సక్రమంగా రాక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు డిసెంబర్ 19 20, 21వ తేదీల్లో జిల్లాలోని అందరు ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు అందిస్తామన్నారు. డిసెంబర్ 27న డివిజన్ కేంద్రాల్లో 6 గంటల ధర్నా, జనవరి 3న జిల్లా కేంద్రంలో 12 గంటల ధర్నా, జనవరి 7, 8 రాష్ట్ర కేంద్రంలో 36 గంటల ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు రమణయ్య, ఉపాధ్యక్షురాలు సరళ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, జిల్లా కార్యదర్శి రఘురామయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, మండలాల నాయకులు గంగాధర్, రాజుకుళ్ళాయి పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఫలితాలపై శిక్షణ

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని 74- ఉడేగోళం రైతు భరోసా కేంద్రంలో ఆత్మా పీడీ మద్దిలేటి ఆధ్వర్యంలో మంగళవారం భూసార పరీక్ష ఫలితాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం మండల వ్యవసాయ అధికారి మహేంద్ర, మండల రైతుభరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోండి

రాయదుర్గం రూరల్ : రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని ఎడిఎ లక్ష్మా నాయక్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని 74 ఉడేగోళంలో బోరు బావుల కింద సాగుచేసిన పంటలను మండల వ్యవసాయ అధికారి మహేంద్రతో కలిసి పరిశీలించారు.

జిల్లాస్థాయిలో విద్యార్థిని ప్రతిభ

పుట్లూరు : జిల్లాకేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అనుహ్యారెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. గైడ్ టీచర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఫ్రీ బస్ విత్ ఔట్ పొల్యూషన్ అంశంపై ప్రదర్శనలు చేసి వివరించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని జిల్లాస్థాయిలో మొదటి బహుమతిని కైవసం చేసుకుంది. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అనుహ్యారెడ్డిని ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఉర్దూ గజల్ ఖవ్వాలి పోస్టర్లు ఆవిష్కరణ

అనంతపురం : నగరంలోని జిల్లా పరిషత్ సమీపంలో నిర్వహించనున్న గజల్ ఖవ్వాలికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం స్థానిక ఈద్గా మసీదులో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీం అహమ్మద్, మేయర్ మొహమ్మద్ వసీంసలీం, జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మన్ కాగాజ్ ఘర్ రిజ్వాన్, జిల్లా వైసిపి మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్, కార్పొరేటర్లు బాబా ఫక్రుద్దీన్, వైసిపి నేతలు షేక్షావలి, మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

కంటి అద్దాలు పంపిణీ

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలువురు వృద్ధులకు మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, మండల అధ్యక్షులు నాగేశ్వరరావు మంగళవారం కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చికెన్ గోపాల్, బాలనాగి, బయన్న, మాజీ సర్పంచి ఖాదర్ వలీఖాన్, మాజీ వార్డు సభ్యులు భాస్కర్‌నాయుడు, శింగనమల మార్కెట్ యార్డు కమిటీ సభ్యులు అమీర్, వైసిపి నాయకులు వేదాంత మోహన్, పెద్దన్న, మెడికల్ ఆఫీసర్లు ప్రవీణ్‌కుమార్, సాదియా, సిహెచ్ఒ బాలాజీ, సూపర్‌వైజర్ అక్కులప్ప, వైద్య సిబ్బంది మునిరెడ్డి, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బుక్కరాయసముద్రం : అర్హులైన లబ్ధిదారులు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ తేజోష్ణ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని సిద్ధరాంపురం, పసులూరు పంచాయతీల్లో వికసిత భారత్ సంకల్ప యాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, సిద్ధరాంపురం సర్పంచి కొండన్న, పసులూరు సర్పంచు కల్పన, వికసిత సంకల్ప యాత్ర కో ఆర్డినేటర్ సాయినాథ్‌రెడ్డి, డ్రోన్ పైలెట్ నాగేశ్వర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.